క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు స్పందన

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. వాటిలో కొన్ని అశ్వారావుపేటకు ఉదయం 5 గంటలకు బస్సు నడపాలని, బొమ్మనపల్లి వద్ద ఉదయం పూట బస్సులు నిలపడం లేదని, నిలపాలని కోరారు. అదేవిధంగా మహబూబాబాద్ నుంచి ఇల్లెందుకు రాత్రి 8 గంటలకు బస్సును ఏర్పాటు చేయాలని విన్నవించారు. వీటిని పరిశీలిస్తామని డీఎం ప్రయాణికులకు హామీ ఇచ్చారు.

జర్నలిస్టుల దీక్షకు పలు సంఘాల మద్దతు

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గంగభిషన్ బస్తీలో ఎనిమిది రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమానికి శుక్రవారం పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. శిబిరాన్ని సందర్శించి జర్నలిస్టు పోరాటానికి అండగా నిలుస్తామన్నారు. నాయకులకు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు నామినల్ ధరకు ఇళ్ల స్థలాలు అందించాలని కోరారు. మద్దతు తెలిపిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, యర్రా కామేష్, మారపాక రమేష్, చిన్ని కృష్ణ, జల్లారపు రమేష్, వ్యాపార సంఘాల, జాతీయ బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

ఆపరేషన్ 'కగార్'ను నిలిపివేయాలి

ఇల్లెందు: ఛత్తీస్‌గఢ్‌లో మారణహోమం సృష్టిస్తున్నారని, ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులను సైతం దారుణంగా హతమారుస్తున్నారని ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, ఎం.శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని కోరుతూ ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముక్తి సత్యం, సూర్నపాక నాగేశ్వరరావు, సారంగపాణి, ఎండీ రాసుద్దీన్, మోకాళ్ల రమేష్, తోడేటి నాగేశ్వరరావు, చిరంజీవి, మోహన్‌రావు, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ భుక్యా రమేష్ శుక్రవారం సివిల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి యాజమాన్యం వెంటనే జీతాల చెల్లింపులపై దృష్టి సారించాలని, జీతాలు, కనీస పనిముట్లు ఇవ్వటంలో నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసకోవాలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతీనెల 7వ తేదీ లోపు ఇవ్వాల్సిన వేతనాలు 20వ తేదీ తరువాత చెల్లిస్తున్నారని తెలిపారు. కార్మికులకు ఇవ్వాల్సిన బూట్లు, హెల్మెట్, యూనిఫాం కూడా ఇవ్వడం లేదన్నారు.

ఓసీని సింగరేణి కార్మికులతోనే నడిపించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓసీని పూర్తిగా సింగరేణి కార్మికులతోనే నడపాలని, జీకే ఓసీ మేనేజర్ మురళీకి టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఏరియాలో నూతనంగా ప్రారంభం కానున్న వీకే ఓసీని ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా గతంలో జీకే ఓసీని నడిపించిన విధంగా ఓవర్ బర్డెన్ (ఓబీ) మినహా మిగిలిన కోల్ ప్రొడక్షన్ పనులు కంపెనీ ఉద్యోగులతో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడప రాజయ్య, విజయ్‌కుమార్, బోరింగ్ శంకర్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


రాజమల్లుకు సన్మానం..

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లును శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అదేవిధంగా క్రీడాకారిణి పాశికంటి లిఖితను కూడా సన్మానించారు. కార్యక్రమంలో అనంతుల లక్ష్మీనారాయణ, కొండా విశ్వేశ్వరావు, దూలం నటరాజు, పుట్టా లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

పాల్వంచరూరల్: ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం 150 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడ్ సెల్, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఫాక్స్‌కాన్, భారత్ బయోటెక్, టెక్ ష్యూర్. సరీస్, బజాజ్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఏప్రిల్ 10న మరోసారి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు.

బాబోయ్ ఎండలు..!



రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. గురు, శుక్రవారాల్లో కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో 41 డిగ్రీలకుపైనే పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలకు వడగాల్పులు తోడవ్వటంతో ప్రజలు ఉష్ణతాపంతో అల్లాడి పోతున్నారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచిస్తోంది. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

- రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- ఉష్ణోగ్రతలకు తోడు వడగాలులు
- 41 డిగ్రీలు దాడుతున్న పగటి ఉష్ణోగ్రత
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్

చుంచుపల్లి: వారం రోజులుగా భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మార్చి చివరలోనే సాధారణం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఆరంభ ఎండలతోనే వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం ప్రధాన రోడ్లన్నీ జన సంచారం లేక వెలవెలబోతున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందుతో పాటు అనేక ప్రాంతాల్లో వడగాల్పులు షురూ అయ్యాయి. గాలిలో తేమ శాతం అమాంతం తగ్గటంతో రోజురోజుకూ ఎండలతో పాటు ఉక్కపోత ఎక్కువైంది. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి మరో 3 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గురువారం కొత్తగూడెం, చుంచుపల్లిలో 40.2 డిగ్రీలు, శుక్రవారం 41.0 చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చిలోనే 40 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. అటు ఎండల తీవ్రత పెరగటంతో ఇళ్లలో ఏసీలు ఫ్యాన్లు, కూలర్ల వాడకం పెరిగింది. ఎండకు భయపడి ప్రజలు మధ్యాహ్నం 11 గంటలలోపే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. అటు వైద్యులు సైతం ఆరంభ ఎండల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండలతో పాటు వడగాల్పులు తీవ్రమైతే వడదెబ్బకు గురికాకుండా రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వడదెబ్బతో ప్రాణాలకే ప్రమాదం..

ఎండ తీవ్రతకు ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు శరీరంలో మార్పులు చోటుచేసుకుంటాయి. వేసవికాలంలో ఎక్కువ మంది ఎదుర్కొనే ప్రధాన సమస్య ఇదే. బయటి ఉష్ణోగ్రతలతో పోటీగా శరీర ఉష్ణోగ్రత కూడా బాగా పెరిగిపోతుంది. దీంతో చెమట రూపంలో శరీరం తననితాను చల్లబరుచుకొనే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలో శరీరంలో ఉన్న నీరంతా చెమట రూపంలో వస్తుంది. చెమటతో పాటు పొటాషియం, సోడియం, క్లోరైడ్, పాస్పరస్ వంటి లవణాలు కూడా బయటకు వెళ్తాయి. ఎండాకాలంలో డీహైడ్రేషన్ వల్ల ఒక్కోసారి రక్తనాళాలు ఉబ్బి రక్తపోటు పడిపోతుంది. దీంతో మెదడుకు రక్తప్రసరణ ఒక్కసారిగా తగ్గి ఉన్నట్టుండి కళ్లు తిరిగి పడిపోతారు. అందువల్ల ఎండలో బయటకు వెళ్లేముందు, వెళ్లాక కూడా తప్పకుండా మంచినీళ్లు, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణాలు, పండ్ల రసాలు తీసుకోవాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే చక్కెర, ఉప్పు కలిసిన ద్రావణాన్ని తాగించాలి. డీహైడ్రేషన్‌కు గురైనవారికి వాంతులు, వికారం, జ్వరం, కడుపునొప్పి వస్తాయి. ఆలస్యం చేయకుండా డాక్టరును సంప్రదించాలి.

నీరు ఎక్కువగా తాగాలి...



వేసవికాలంలో వడదెబ్బ చాలా ప్రమాదకరమైనది. ఎండ వేడిమికి శరీర ఉష్ణోగ్రత గణనీయంగా పెరగడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే దాని నుంచి తప్పించుకోవచ్చు. వేసవిలో ప్రధానంగా ఇంటి వాతావరణం చల్లగా ఉండేటట్లు చూసుకోవాలి. వడదెబ్బ తగిలితే వాంతులు, అలసట, తలనొప్పి, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ ఎ.పుష్పలత, ఎండీ, జనరల్ ఫిజీషియన్

హక్కులు కల్పించండి..



మాట్లాడుతున్న కృష్ణ

ఇల్లెందు: మోటార్ రంగంలో పని చేస్తున్న కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని ఎన్డీ అనుబంధ ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో జరిగిన రెండు ఇఫ్టూ మోటార్ కార్మిక సంఘాల విలీన సభలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి పలు హామీలు ఇచ్చి నేటి వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు అందజేస్తామని ప్రకటించి మరిచారన్నారు. 2013లో చీలిపోయిన రెండు మోటార్ వర్కర్స్ యూనియన్లు నేడు విలీన సభ ద్వారా ఒక్కటవుతున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో సంఘం కార్మికుల సంక్షేమం, హక్కుల సాధన కోసం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో ఎండీ రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, ఏపూరి వీరభద్రం, మల్లికార్జునరావు, మోహన్‌రావు, మారుతీరావు, కిరణ్, మంగరావు, రామిరెడ్డి, రవి, సిద్ధులు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు భూక్యా శ్యాం, పీవైఎల్ నేత మోతీలాల్ అన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని కొమరారం గ్రామంలో విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించి, బహుమతులు అందజేశారు. మాట్లాడుతూ.. దేశం కోసం ఉద్యమించి తన ప్రాణాలను త్యజించిన భగత్‌సింగ్ పోరాటతత్వం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మోకాళ్ల కృష్ణ, రాజేష్, కుంజ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రెండు ఏసీ ఫంక్షన్ హాళ్లు, నాలుగు దుకాణాలకు నిర్వహించిన బహిరంగ వేలంపాటలకు ఎవరూ రాలేదు. దీంతో వేలంపాటను వాయిదా వేసినట్లు ఈఓ రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ వేలంపాట తేదీని త్వరలో ప్రకటిస్తామని ఈఓ పేర్కొన్నారు.

'ఆధార్'తో హాజరు విధానాన్ని రద్దు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో ఆధార్ నంబరును అనుసరించి హాజరు విధానాన్ని (ఏబీఎఎస్) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) శుక్రవారం డీఎంహెచ్ఓ భాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు డాక్టర్ బాలాజీ, గొంది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగభూషణం, బి.లాలు, ఎబ్నిజర్, రాంప్రసాద్, కుమారస్వామి, జి.ఉమాదేవి, జె.సులోచన, డి.రమాకుమారి, పి.కళావతి, బి.సుజాత, ఎస్.సైదా పాల్గొన్నారు.

పెద్దమ్మగుడి కమిటీని పునఃసమీక్షించాలి

పాల్వంచ: పెద్దమ్మగుడి పాలక మండలి నియామకాన్ని పునఃసమీక్షించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, మండల అధ్యక్షుడు కొండం వెంకన్న అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిటీలో స్థానిక గ్రామాలైన కేశవాపురం, జగన్నాథపురం గ్రామస్తులకు అవకాశం కల్పించాలని, కమిటీలో సమతుల్యత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వారిని డైరెక్టర్లుగా తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోలేదన్నారు. పార్టీలో ఎన్నో సంవత్సరాల కష్టపడి పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులకు మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. సమావేశంలో బానోతు రామునాయక్, బట్టు మురళీ, సాదం రామకృష్ణ, గంగిరెడ్డి భువన సుందర్‌రెడ్డి, విజయ్, వెంకటాచారి, శ్రీనివాస్, మధు, కట్టా సోమయ్య, హుస్సేన్, సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

పాలకవర్గంలో స్థానం కల్పించండి..

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి కమిటీలో విశ్వహిందూ పరిషత్ సభ్యులకు స్థానం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఆలయ ఈఓ రజనీకుమారి భజరంగదళ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. దేవస్థానం కమిటీలో దేవుడుని నమ్మని నాస్తిక పార్టీల నాయకులకు చోటు కల్పించారని, ధార్మిక సంస్థల ప్రతినిధులను తీసుకుంటే దేవాలయ పవిత్రతను కాపాడతారని కోరారు. గడిదేశి వెంకటేశ్వర్లు, చిలుకూరి నాగేశ్వరరావు, వింజమూరి మురళీకృష్ణ, మధుసూదనాచారి, లింబానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయండి..



డీఎంఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ పర్సనల్ సెక్రటరీ దయాకర్‌రెడ్డికి శుక్రవారం ప్రజా సంఘాల జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి(డీఎంఓ) అలీంలకు కూడా వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు బానోత్ ధర్మా, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ కేశవ్ నాయక్, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ నాగేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు బానోత్ మధు, వల్లమల్ల చందర్‌రావు, భూక్యా శివ, నరసింహారావు, వీరు, రవి, శంకర్, భద్రు, గత్తం బాబురావు, భాస్కర్, సుందర్, బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జ్యోతిరాణి ఆదర్శం



హెచ్ఎంను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న మేకల జ్యోతిరాణి ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఆమెకు సన్మాన మహోత్సవం నిర్వహించారు. జాక్టో చైర్మన్ సదానంద్ గౌడ్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులందరూ జ్యోతిరాణిని ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు జ్యోతిరాణిని ఘనంగా సన్మానించారు. ఎంపీపీఎస్ బొమ్మనపల్లి చైర్ పర్సన్ పొగాకు లక్ష్మి, ఎంఈఓ జగన్ సారథ్యం, ఏకజర్పల పద్మ, టీచర్ నీరజా షారోన్, జిల్లా సమ్మిళిత విద్యాశాఖ అధికారి సైదులు, అకడమిక్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌కు హాజరైన ఏరియా జీఎం



మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఇఫ్తార్‌లో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో సర్వమతాల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అన్నదమ్ముల వలె కలిసిమెలసి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, దీనికి అనుగుణంగా సంస్థ వారివారి మతాలకు అనుగుణంగా నిర్వహించే ప్రధాన పండుగలకు అడ్వాన్స్‌లు, సెలవుదినాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్, భిన్నత్వంలో ఏకత్వం మన భారతీయ సంస్కృతి, కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలసి జీవిస్తున్నారన్నారు. అదేవిధంగా సంస్థలో పనిచేసే ఉద్యోగులు కూడా ఉండాలని అన్ని మతాల పండుగలను గౌరవించాలని కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు కఠోరమైన ఉపవాస దీక్షలు.. మనిషిలో నీతి, ధర్మం, ఆప్యాయత, అనురాగాలను పెంపొందిస్తాయన్నారు. ఈ సందర్భంగా సంస్థలో పనిచేసే ముస్లింలకు, కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజెంట్ రవీందర్, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎస్‌కే కరీముల్లా, జాఫర్, సాకీర్, మొహినుద్దీన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా టెండర్ల ప్రక్రియ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో శుక్రవారం టెండర్ల ప్రక్రియ గుట్టుగా నిర్వహించారు. ఎవరికీ కనీస సమాచారం ఇవ్వకుండా వచ్చిన వారితో టెండర్లు నిర్వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో డైలీ మార్కెట్, కబేళా, వారపు సంతలకు ఓపెన్ టెండర్ నిర్వహించారు. ఇందులో డైలీ మార్కెట్‌ను శీలం శేఖర్ రూ.23.50 లక్షలకు దక్కించుకున్నారు. దీంతో పాటుగా కబేళాకు ఒక్కరే వేలంపాటకు హాజరయ్యారు. ఇక వారపు సంతకు మున్సిపాలిటీ వారి పాట రూ.34 లక్షలుండగా, పాటలో పాల్గొన్న మోడె మోహన్‌రావు రూ.13.23 లక్షలకు పాడుకున్నారు. అయితే కబేళాకు ఒక్కరే వేలంపాటలో పాల్గొనడం, వారపు సంత తక్కువకు వేలంపాట పాడడం వలన ఆ రెండింటినీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ అనుమతితో మళ్లీ వేలంపాట నిర్వహించడమా, వారికే అప్పగించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అయితే ఇటీవల కొత్తగూడెం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ సమాచారాన్ని అందించడంలో విఫమవుతున్నారని, మూడు మున్సిపాలిటీలకు ఒక్కరే కమిషనర్‌గా వ్యవహరించడం వలన సమన్వయం లోపించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

'అధికారుల తీరుతో కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం'



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కొందరు సివిల్ అధికారుల తీరుతో కాంట్రాక్ట్ కార్మికులు నష్టపోతున్నందున బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి ఎర్రగాని కృష్ణయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ ఏరియాలోని సివిల్ అధికారుల స్వార్థం, నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో ఆగడాలు మరింత పెరిగాయన్నారు. కొంతకాలంగా కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యపరీక్షలు, సీఎంపీఎఫ్ నంబర్లు ఇవ్వకపోగా, అరకొరత వేతనాలే చెల్లిస్తున్నారని, సింగరేణితో సంబంధం లేని బయట వ్యక్తులకు మాత్రం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని చెప్పారు. ఈ సమావేశంలో కె.నర్సింహారావు, వినోద, గణేష్, లచ్చు, భాస్కర్, సంజీవరావు, రమణ, బాలాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'గూడు'కు గుర్తింపు ఇవ్వండి..



ఆందోళన చేస్తున్న గుడిసెవాసులు

ఇల్లెందురూరల్: సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సీఎస్సీ బస్తీ గుడిసెవాసులు చేపట్టిన రిలే దీక్షలలో భాగంగా శుక్రవారం ఎంపీడీఓ, మిషన్ భగీరథ కార్యాలయాలను ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని ఆరేళ్లుగా జీవిస్తున్న పేదలుకు ఇంటి నంబర్లు, తాగునీరు, విద్యుత్, రహదారుల సౌకర్యం కల్పించాలని కోరుతూ పలుమార్లు ఆందోళనలు చేసి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. అయినా స్పందనలేకపోవడంతో నాలుగు రోజులుగా రిలే దీక్షలు చేపట్టామన్నారు. పేదల సమస్యల పట్ల అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్యాలయాలను ముట్టడించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, వజ్జ సురేష్, వీరభద్రం, వెంకన్న, కౌసల్య, కోటమ్మ, రాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా బదిలీపై వివాదం



అంగన్‌వాడీ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ ఆయా బదిలీ వివాదానికి దారి తీసింది. వెంగన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రం-2 ఆయా బూరం వరలక్ష్మి ఇటీవల బదిలీపై జూలూరుపాడు-4 కేంద్రానికి వచ్చారు. ఈ బదిలీని వ్యతిరేకిస్తూ కేంద్రం ప్రధాన గేట్‌కుజూలూరుపాడు కోయకాలనీ మహిళలు తాళం వేసి ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ కేంద్రం-4లో టీచర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉండగా, వెంగన్నపాలెం కేంద్రం నుంచి ఆయాను ఇక్కడకు బదిలీ చేయడం సరికాదన్నారు. వెంగన్నపాలెం2లో ఆయా పోస్టును 2018లో భర్తీ చేయగా జూలూరుపాడు కోయకాలనీకి చెందిన బూరం వరలక్ష్మి గుర్తింపు కార్డులు మార్చుకుని అక్కడ స్థానికతతో ఎంపికైందన్నారు. సర్టిఫికెట్ల ఆధారంగా ఆమె జూలూరుపాడు స్థానికురాలు కానందున వెంగన్నపాలెంలోనే కొనసాగించాలన్నారు. ఇదే సమయాన ఐసీడీఎస్ చంద్రుగొండ సీడీపీఓ సలోమి అక్కడకు రాగా, విషయాన్ని ఆమెకు వివరించారు. అయితే, వరలక్ష్మి, ఆమె భర్త నరసింహారావు మాట్లాడుతూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆయా ఉద్యోగం ఇప్పిస్తానంటూ సర్టిఫికెట్లు మార్చాడని, అందుకోసం ఉపాధ్యాయుడు, గత సీడీపీఓకు రూ.లక్షల ఇచ్చినట్లు చెప్పారు. ఈవిషయమై విచారణ జరిపిస్తామని సీడీపీఓ చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్ లీవ్ బిల్లులు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, ఐదు డీఏలు, పీఆర్‌సీలు ప్రకటించాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా శాఖ పిలుపు మేరకు శుక్రవారం మండల శాఖల ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. కొత్తగూడెంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న సొమ్ము ప్రభుత్వం వాడుకోవడం వలనే సకాలంలో బిల్లులు చెల్లించలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన కార్యక్రమాలలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



కొత్తగూడెంఅర్బన్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



టేకులపల్లి: ముత్యాలంపాడు హైస్కూల్‌లో..